# అముళ్ళదిన్నె శర్మగారి అబ్బాయి అను ఏసోబు




మం దువా రోగిలి ఆరోజు అంత సందడి లేకుండా వుండినది. మా పెదనాయన(సోమంచి కృష్ణయాజులు గారు) బయట పెణక కింద నించొని జంధ్యాన్ని వొకవేళ్లో ముందుకు వెనక్కూ, లాగుతూ వీపు తీట తీర్చుకుంటున్నాడు. అలాటి వొకడావపోగు అందుకు తప్ప మరిదేనికీ వాడడం నేను చూడలేదు.

-మాలంబ్డీకొడుకులు.. థూ మాలంబ్డీకొడుకులు అంటూ రొంటిమంచి పొడుం కాయ తీసి వొక్క పీల్చు పీల్చినాడు అవేళ కొద్దిగా ముక్కుపట్టి వుండింది. వంట గదిలోంచి ఇంగువా చారు, అగరొత్తుల పొగ కలిసిన వింత వాసన రోగిలి అంతా వ్యాపించినది.

-మిషనరీ స్కూల్పురావడం ప్రాణాంతకం అయింది. జాత్తక్కువ పీనుగులంతా బరి తెగించినారు .అని, మళ్ళీ మాలంబ్డీకొడుకులు, మాలంబ్డీకొడుకులు అంటూ పెదనాయన గురగుర లాడినాడు.

తెల్ల విశ్వాసం అనే రెవిన్యూ గుమాస్తా వొకాయన మా ఇంటి ముందు నుంచి అప్పడే వెళ్ళినాడు. నేను చెవులాలని రంగుగల అత్యద్భుతమైన బుష్‌కోటును, ఆకుపచ్చ పంట్లాం లోకి దోపి షిల్డరు బూట్సులు వేసుకుని వుండినాడు. అది వాకెంతో వచ్చినది. మా పెదనాయన మాత్రం ఎందుకో అతనిని తిట్టినాడు. మనిషైపుట్టాక అలాటి రంగులు గల మహత్తమమైన అయిన గుడ్డలు వేసుకోవాలని పెద్ద బ్రాహ్మలకి వుండదు. వాలాంటి చిన్న బ్రాహ్మలు అడిగితే-ఎగ్గు మాలిన పనులు తల పెట్టకు అని తిట్టినారు.

మొలకుత్తన వొంటిమీద వొక్క గుడ్డ అయినా లేకుండా మా నాయన, పెదనాయన, బాబయ్యలు వీధులలోకి పోరా విరుచుకుని పోయేడివారు. వాళ్లకు దక్షిణలు, దణ్ణాలు బానే వుంటాయి. వొంటిమీద ఏ ఆచ్ఛాదనా లేక పోయినందుకు వాళ్లకు ఎగ్గలేదు. విశ్వాసం వంటి మాలాడు మహా తమాషా అయిన గుడ్డలు వేసుకునేసరికి అంత చోద్యంగా వున్నకోవడం వేనెరుగుదును. వొంటిమీద అన్ని గుడ్డలు పుట్టినటికిప్పు విశ్వాసం వంగి వంగినానే పోతుంటాడు.

-బ్రాహ్మలలో గుడ్డలు వేసుకోవాల్న తహతహ యేదీ వుండదా? అని వేను యోచిస్తుండగా, మా దొడ్డమ్మ మాటలు వినవచ్చినవి. బొడిగుండు పై ముసుగు సరిచేసుకుని జీలుగు బర్లతో మడిబట్టను గోడమీంచి లాగి

-ఈ కుర్ర ముండలతో వేగలేక చస్తున్నాను. ముట్టూ అంటూ లేకుండా శుద్రాళ్ళ పాయినా తయారైనారు అంటూ తిట్టినది. అంతలో మా పెదనాయన అందుకొని మాలంబ్డీకొడుకుల వల్లే ఇదంతాను... ఈ విధవముండలకి మిషనరీ స్కూల్పు కావల్సొచ్చిందేం? అంటూ మా అక్కయ్యను తిట్టినాడు.

రొండో వాటా లోంచి మా బాబయ్య వొక పత్రికను గుండ్రప్పటిగా చుట్టి బయటకొచ్చి నాడు. -ఒరే వొక సిజర్స్ పెట్టి గుర్రం వాడా అగ్గిపెట్టి తే పో! అని వన్ను కొట్టుకు బెత్తాయించినాడు. ఆ కొట్టు కివతల చింతచెట్టు కింద శూద్రాళ్ళ ఆడమనిషి పుల్లట్లు మహ రుచిగా వేస్తుంది. పావలాకు మూడు!! సిజర్స్ తేగా మిగిలిన చిల్లరతో అట్లు తినవలెనని నా ఆశ. దాని కూతురు నా ఈడుదే!

-ఓలమ్మా... బేపనోడు ఆపాలు తింటాడంట. అహ్హహ్హ.. అంటూ నవ్వుతుంటే దాని ఆగడం చూసి నాకు ముచ్చెమటలు పోసేవి. కొంపలో ఈ విషయం పొక్కినట్లాయెనా? నాకు బడితెపూజ తప్పదు.

వొకసారి మా పెదనాయన నేను కుప్పాయెగ్గిన్న శాస్త్రి నన్ను చింతచెట్టు కింద ఆపాలు తింటుండగా చూసినాడు. ఆ సాయంత్రం మా నాయన కాపుకాసి నన్ను బజ్జేంచి తీసుకు పోయినాడు. -అరి మ్లేచ్ఛుడా! నీకేమి దొమ్మ దాపురించిందిరా? హన్న!! శూద్రకూడుపై యావ పోయిన దేమిరా? భ్రాష్టుడా! అని బాగా తిట్టి వొక జంతిక కొని పెట్టినాడు. అలా చేయనాకు... పెదనాయకనకు తెలిస్తే. అక్కడితో సరి! నేనిట్లా నిన్ను కలిసినట్టు ఎవరికీ చెప్పకు. యెగ్గిన్న పెదకాలువ దగ్గర కనబడి నీ భ్రాష్ట్రాన్ని చెప్పినాడు. మరికపై ఇలాటి పనులు చేయకు అని సైకిలెక్కి మూడు లాంతర్ల సెంటరు వైపునకు వెళ్ళిపోయినాడు. తదాదిగా నాకు పుల్లట్లు తినాలన్న ఆశ బాగా పెరిగినది. మా నాయన ఆరోజు నాకు కొనిచ్చిన జంతికను బహుశా శూద్రాళ్ళే తయారు చేశారని నేను ఇప్పటికీ నమ్ముతున్నాను.

బడి గంట మూడవసారి మోగినది. ఎండ చుర్రుమంటున్నది. -యాకుందేందు తుషార హార ధవళా... అని బడి అసెంబ్లీలో లక్కావఝుల గోపాలం గారి అమ్మాయి ప్రార్థన మొదలు పెట్టి వుండింది. ఆరోజు యెంచేతో నాకు ప్రార్థన మీద భక్తి తగ్గినది. ఎండ వలన పిల్లలకు భక్తి తగ్గడం అందరం ఎరిగిన విషయమే కదా?

నా పక్క వరస మంచి ఏసోబు తెల్లగా నవ్వినాడు. వాడట్లా నవ్వుతుంటే మనక్కూడా అట్లా నవ్వాలని పిస్తుంది. నల్లటి రంగు మొత్తంగా వున్న వాడి శరీరంలో పళ్ళకే తెల్లరంగు వుండింది. వాడు నాకు పరమ ఆప్తుడు. చీమ చింతకాయ గుబ్బలు సన్నగా బ్లేడుతో చీరిన తేగ ముక్కలు, పప్ప చెక్కలు జామెంట్రీ బాక్సులో వేసుకొచ్చి నాకు పెడతాడు. ఆ బాక్సునందు కోణమానిని, వృత్త లేఖిని వంటివి నేనెప్పుడూ చూసి వుండలేదు. మినపసున్ని, గోరు మీటీలు, తొక్కుడు లడ్లు నేనుతెస్తాను. వాటికన్నా చీమ చింతకాయల్లోనే ఏదో మజా వుండింది.

ప్రార్థన అవగానే బడి మొదలయింది. గదంతా వొకరకమైన ఉల్లాసకరమైన వాసనతో నిండి వుండినది. చాక్‌పీసుల పొడి, గోడల పక్కనుంచి వచ్చే వుచ్చల వాసన మధ్య ఈ తిళ్ళు! ఆ వాసనా పీల్చవలసిందే యెవరైనా!!

అవుట్ బెల్లుకు ముందు వొక బట్టతల ఆయన క్లాసులోకి వచ్చి మాస్టారుతో యేదో చెప్పి నమస్కరించినాడు. ఆ తర్వాత ఆయన-బ్రాహ్మల పిల్లలంతా నాతో రండి. బులుసు దొడ్డమ్మగారి ఇంట్లో ఇవేళ వందికేశుడి నోము. అట్లు పెడతారు. కావలసినవన్నీ తినొచ్చు. కానీ చిన్న తునక కూడా వదలకూడదు. మహాపాపం అలా చేస్తే!! బ్రాహ్మల పిల్లలంతా లేచి రండి. అని వెళ్ళి పోయినాడు. వూరకే అట్లు! అవీ తిన్నన్ని తినొచ్చు. వందికేశుడి నోములు మాలో మామూలే.

మేమంతా జట్లు వేసుకుంటుండగా ఏసోబు -"బ్రాహ్మలే ఎందుకురా? అనినాడు. మరి మేమో?" అట్లు బ్రాహ్మలే తినాలి అన్నాను. ఎంచేత అలా?- నువ్వేమో మా సోడా తాగుతావు. మా పంది పిల్లలతో ఆడతావు. సోడాబండిని బుర్రుబుర్రున నడిపిస్తావుకాదా? అనినాడు. ఇప్పుడువాడిని తీసుకెళ్ళకుంటే నాకు యేం బాగోదు! మా పెదనాయన వాడిని మాలకాకి, యానాది కుక్క అంటాడు. వాడు అట్లా నాకెప్పుడూ కనిపించ లేదు. పైగా సుబ్బమ్మదేవి స్కూలు వెనుక వున్న వాళ్ళ తోళ్ళ షాపుల్లో నా ఆటలన్నీ సాగేవి. బుజ్జి బుజ్జి పందిపిల్లలూ, ఎర్రగా కమురు రంగుకుతిరిగిన తోళ్ళు, కొన్ని ఖాళీ సోడా బళ్ళు, వొక చిన్న బడ్డీ అక్కడ వుండినవి. అవన్నీ నాకు మహా ప్రీతిపాత్రమైనవి. వాడు మాల్లంబ్డీకొడుకైతే నేను బేపన లంబ్డీకొడుకుని. వాళ్ళింట్లో నన్ను కూడా అలానే అంటారేమో? ఏది ఎట్లున్నా వాడిని అట్ల నోముకి తీసుకుపోవాలి. ఇదిగో ఏసూ- వొకమాట. నువ్వు అక్కడ ఏమీ మాట్లాడనాకు. నువ్వు అముళ్ళదిన్నె శర్మగారి అబ్బాయివని నేనంటాను. నువ్వు తల ఊచు! అదీ నేనలా అన్నప్పుడే తల ఊచాలి సరేనా??

మేమంతా ఒక వరసగా బయలుదేరి డొంకరోడ్డు దాటి ఒక్కసారి జట్లుగా విడి పోయినాము. పెదకాలువ హనుమంతుడి గుడిపక్కన బులుసు దొడ్డమ్మగారి యిల్లు! మమ్మల్ని అందరినీ బట్టతలాయన లోపలికి తీసుకువెళ్ళినాడు. బాదం ఆకుల కుట్టుడు విస్తర్లలో అల్లప్పచ్చడి లేత యెరుపులో తెల్లటి పొరల వలె వున్న అట్లూ వేసినారు. ఏసోబుగాడు తక్కున ముట్టినాడు. నీకు వొడుగైందా అని అడిగాను. అదేమో! అది కావట్లయితే అట్లు తినరాదా అన్నాడు. ముందు వొడుగైన వటువు ముట్టాలి. అందాకా మనం తినకూడదు అన్నాను. మా పెదనాయన అలాగే అంటాడు. అలాగే నేనూ చెప్పినాను. -వొడుగంటే ఏమి వుంటుంది? "అది అవ్వాలి. అప్పుడు తెలుస్తుంది" నేను అన్నాను. నాకూ తెలియదు. తినగలిగినన్ని అట్లు నేనూ ఏసోబు తినేశాము. బ్రాహ్మలు మాత్రమే చేసే, తినే నోములో శూద్రాడు కూడా తినినాడు. నా సామి రంగా! నాకు భలే మజా వచ్చింది. ప్రతి శూద్రుడు ఏసోబులాగునే బ్రాహ్మడై పోతే బాగుంటుంది. అలా అవ్వడానికి నేను కొన్ని గోత్రాలు ఇళ్ళ పేర్లు చెబుతాను. అప్పుడు అందరూ అట్లు తినొచ్చు.

మేమందరం ఎనమదుర్రు చెక్క, వొంతెన ఎక్కేసరికి ఉగ్రరూపుడైన బట్టతల మనిషి ఒరేయ్! మాల్లంజాకొడకా, నీ. కెన్ని గుండెలురా, ఆగరా అంటూ రంకెలు వేయసాగాడు. నా గుండెలు జారి పోయినవి. వొకవేళ ఏసోబు శూద్రాడని తెలిసిందా? శూద్రాళ్ళా... మాలాళ్ళు వొక్కళ్ళేనా? నాకు సందేహమయి అడిగాను. -మీరు శూద్రాళ్ళా, మాలాళ్ళా? ఏమిటి తేడా అన్నాను. వాడు అయోమయంగా చూసి యేదో చెప్పబోయే లోగా వొక పెద్దచెక్క, పేడు వాడి వీపును తాకినది. నాకు భయమైంది. -యెంత ధైర్యంరా నీకు? బులుసుదొడ్డమ్మ ఇంటిదగ్గరి బట్టతలవాడు ఏసోబును కొట్టినాడు. ఏసోబు చొక్కా ఆ పేడుకు వున్న మేకుకు దిగి చిర్రున చీలిపోయింది. వాడి నల్లటి వీపుపై ఎర్ర పెన్సిల్‌తో రాసినట్టయింది. అమ్మతల్లో! అని అరిచినాడు. చాలామంది ఈగొడవకు పోగయినారు. ఊ నడవండి అని కొందరు మమ్మల్ని తరిమేశారు. మా పెదనాయనకు ఈ సంగతి తెలిస్తే? నాకు గుండె జారి పోయి వుండింది.

మూడు రోజులు గడిచి పోయినాయి. ఏసోబు గాడికి వాతం కమ్మిందని పుల్లట్ల శుద్రదాని కూతురు చెప్పింది. ఎందుకిట్లా అయిందో నాకు తెలియకుండా వుండింది.

నేను అవుట్‌బెల్లులో తోళ్ళషాపుల దగ్గరకు వెళ్ళినాను. ఏసోబు వాళ్ళ నాయన నన్ను చూసి వొక బూతుమాట అన్నాడు. బాపనోడు బాపనోడిలా వుండాలిట. మాలాళ్ళతోనేస్తం కట్టరాదని చెప్పినాడు. అలా చేస్తే మాలాళ్ళని బతకనివ్వరట.

-ఇకపై ఇక్కడికి రానాకు. మా లంజోడిక్కి తలలేదు. నీకేమొచ్చింది? అన్నాడు. నాకు పెద్దగా ఏడుపు వచ్చింది. ఏసోబును తీసుకెళ్ళినందుకు నన్ను కూడా కొట్టాలి. నా వీపు చీరేయాలి. అలా కాలేదు. ఆ తర్వాత వాడు బడి మానేసినాడు. వొకనాడు చీమ చింతచెట్ల దగ్గర అవుపడినాడు. ఆ నోముకు వచ్చినందుకు దొడ్డమ్మగారి దత్తుడు చావబాదినాడని, ఆ తర్వాత వాళ్ళ నాయనా, వాళ్ళ అమ్మ కూడా తననే బాదినారని అలాటి పెద్ద ఇళ్ళకు మాలోళ్ళు వెళ్ళకూడదని చెప్పినారని అన్నాడు. నేను మా దొడ్డమ్మలా బుగ్గలు నొక్కుకుని హన్నహన్న!! అనినాను. నాకు అలా అనాలనిపించింది. ఆ తర్వాత వాడు బాగా ఏడ్చినాడు. నేను కూడా ఏడ్చినాను. "నాజోలికి రానాకు! నువ్వు వచ్చినప్పుడల్లా నేను దెబ్బలు తింటున్నాన"ని చెప్పినాడు.

తదాదిగా వాడు నన్ను ఎక్కడ చూసినా వొక భూతాన్ని చూసినట్టు జడుసుకునే వాడు. నాకు ఇదంతా బాధ అయింది. మాలాళ్ళకీ, బ్రాహ్మలకి వొకేల్లా ఆకలి వేస్తుందని, వొకేలా అట్లో, అన్నమో తింటారు అనిపించింది. ఇదంతా ఎందుకు ఇలా జరిగిందని మా తెలుగు మాస్టారిని అడిగినాను.

గవర్నమెంట్ రూల్స్ వచ్చి మాలమాదిగలు పంఘంలోకి వొచ్చేసినారని వాళ్ళతో గవర్నమెంటుకు యెంతోపని వుందని, అలా కావడం చేతనే లోకంలో పాపం పెరిగిందని ఆయన చెప్పినాడు. ఎవడు ఎక్కడ వుండాలో అక్కడే వుండాలి అన్నాడు. -అలా యెంచేత? అని అడిగినాను. నా చెవిని మురిపెంగా మెలిపెట్టి ఇదే చురుకు వుంటే పెద్దైనాక వార్డు కౌన్సిలరవు అయ్యే లక్షణాలు వున్నాయని చెప్పి వెళ్ళిపోయినాడు. ఆల్‌జీబ్రాలోని కొన్ని లెక్కలు ఇప్పుడునేను బాగా అర్థం చేసుకోగలను. ఈ మాటలు మాత్రం అర్థం కావు.

నా సాయంత్రాలు ఇపుడు మా ఇంటి పెణక కింద నిర్భాగ్యంగా గడిచి పోతున్నాయి. సరదా మజా యేవీ లేవు. ఏసోబుగాడి తెల్లటి నవ్వు, కుయ్యోమని నవ్వొచ్చేలా మోగే గోలి సోడా, బుర్రుబుర్రు మనే సోడా బండి, లేత కమురు తోళ్ళు యేవీ నాకిప్పుడు లేవు. ఈ పెద్దాళ్ళంతా కలిసి యేదో చేసినారు. నాకు గోలీ సోడా కావాలంటే, పంది పిల్లలతో చేరి పుల్లాట ఆడాలంటే ఎన్నాళ్ళు పడుతుంది? ఇవన్నీ నాకు కాకుండా చేసిన బులుసు దొడ్డమ్మగారి దత్తుడిని పెద్దైనాక చంపి పారేయ్యాలని అనుకున్నాను.అయినా నాకు ఆత్మ శాంతి చాలలేదు. అంచేత గుండ్రప్పటి గులకరాయి వొకటి చేత్తోపట్టుకుని పెద కాలువ హనుమంతుడి గుడి వైపునకు పరుగు పెట్టాను.

(నా బాల్యాన్ని మింగేసిన కులం సాక్షిగా ఈకథ అందరినీ వుద్దేశించి రాసిందే! ఏమాత్రం కల్పితం కాదు)